క్లుప్తంగా

పీలేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా రోషన్



పీలేరురూరల్ : పీలేరు ఆర్టీసీ డిపో మేనేజరుగా ఎస్.ఎం.డి. రోషన్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఎంగా పని చేస్తున్న బి. నిర్మల బదిలీపై తిరుపతి ఏటీఎం డీఎంగా వెళ్లారు. గూడూరు డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న రోషన్ పదోన్నతిపై పీలేరు డీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలందించి డిపో అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

ఇంటింటి చెత్త సేకరణ ముమ్మరం చేయండి



చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ములకలచెరువు : ఇంటింటి నుంచి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరం చేపట్టాలని ఎంపీడీఓ హరినారాయణ ఆదేశించారు. బుధవారం ఆయన సెంట్రల్ స్కూల్ పంచాయతీలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం ఆరు గంటల నుంచి ఇంటింటికి వెళ్లి పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని పారిశుధ్య కార్మికులను సూచించామని చెప్పారు. పంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలని కోరారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శుల నియామకం



నాగరాజు



రుఫాన్సీరాణి

మదనపల్లె సిటీ : జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులుగా నాగరాజు, రుఫాన్సీరాణిలను నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈఓ సుబ్రమణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ నాగరాజు కలకడ మండలం కోన జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసే పీడీ రుఫాన్సీరాణిను నియమించినట్లు తెలిపారు. వీరు జిల్లాలో క్రీడాసమాఖ్యకు సంబంధించి అండర్-14,-17 విభాగాల బాలబాలికల క్రీడల నిర్వహణ,జట్ల ఎంపిక, స్కూల్ గేమ్స్‌లో పాల్గొనే విధంగా విధులు నిర్వహిస్తారన్నారు. మొట్టమొదటి సారిగా మహిళా కార్యదర్శిని నియమించినట్లు తెలిపారు.

భక్తులకు అన్నదానం

మదనపల్లె సిటీ : మిలాదీ ఉన్ నబీ పురస్కరించుకుని స్థానిక జామియా మసీదు వద్ద దక్నీపేట యూత్ ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ జలాలుద్దీన్‌సాహెబ్ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సలీమ్, రఫి, జమాల్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు

గాయపడిన కూలీలను ఆదుకోవాలి

– సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. బుధవారం టమాట కోతకు వెళ్తున్న కూలీల ఆటో కురబలకోట మండలం ముదివేడు వద్ద బోల్తా పడింది. గాయపడిన బాధితులను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పరామర్శించిన ఆయన మాట్లాడుతూ కరువు పరిస్థితుల కారణంగా కూలీలకు పనులు లేకుండాపోయాయని అన్నారు. వీరి వైద్యం కోసం ఒకొక్కరికి రూ.5 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డిపై రాజకీయ కక్షతోనే అక్రమ కేసు

కలికిరి(వాల్మీకిపురం) : రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డిని కూటమి నేతలు రాజకీయంగా ఎదుర్కోలేకనే లేని లిక్కర్ స్కామ్ కేసులో ఇరికించి కక్ష పూరితంగా అరెస్టు చేశారని ఏపీఎండీసీ మాజీ డైరెక్టరు సి.హరీష్ రెడ్డి అన్నారు. లిక్కర్ స్కామ్ కేసులో మధ్యంతర బెయిల్‌పై వున్న ఎంపీ మిథున్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో హరీష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగా పెట్టిన కేసులు నిలబడవని, ఎంపీ త్వరలోనే కేసు నుంచి బయటపడతారని ఆశాభావం వ్యక్తపరచారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు ఆయన వెంట పాల్గొన్నారు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన ముద్ర దాము

కురబలకోట : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముద్ర దామోదర్ రెడ్డి బుధవారం ఢిల్లీలో కలిశారు. ఎలాంటి ఆధారాలు లేని లిక్కర్ స్కామ్ కేసు నుండి మధ్యంతర బెయిల్‌పై వచ్చిన ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. అక్రమ కేసులతో పెద్దిరెడ్డి కుటుంబాన్ని భయపెట్టలేరన్నారు. జనమే పెద్దిరెడ్డి కుటుంబానికి బలం, బలగమన్నారు.

క్షణం ఆలోచిస్తే..వందేళ్ల ఆయుష్షు

- డీఎంహెచ్‌పీ నోడల్‌ఆఫీసర్ డాక్టర్.పి.ఉదయ్‌కిరణ్
- ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవ పోస్టర్స్ ఆవిష్కరణ



ఆత్మహత్యల నివారణ అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నోడల్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, సీఐ రాజారెడ్డి

మదనపల్లె రూరల్ : ఉన్నది ఒకటే జీవితం, ఏం సాధించినా, అందులోనే. అలాంటి అమూల్యమైన జీవితాన్ని క్షణికావేశంలో చేజేతులా నాశనం చేసుకోకుండా ఒక క్షణం ఆలోచించి నిర్ణయం తీసుకుంటే వందేళ్ల ఆయుష్షు కలిగిన ప్రాణాలు నిలుస్తాయని డీఎంహెచ్‌పీ జిల్లా నోడల్ ఆఫీసర్, సైక్రియాటిస్ట్ పి.ఉదయ్‌కిరణ్ అన్నారు. సెప్టెంబర్ 10 ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పోస్టర్స్ ఆవిష్కరించారు. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ... బలవన్మరణాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించి వాటిని నివారించే లక్ష్యంతో సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల దినోత్సవం నిర్వహించడం జరుగుతోందన్నారు. జీవితం ఎంతో అమూల్యమైందని, ఆత్మహత్యకు పాల్పడటం వల్ల కుటుంబసభ్యులు, స్నేహితులు, తీవ్రక్షోభకు గురవుతారన్నారు. జీవితానికి, బలవన్మరణానికి ఒక క్షణమే తేడా అని, దాన్ని అధిగమిస్తే ఎన్నో జీవితాలను కాపాడవచ్చన్నారు. ఆత్మహత్య ఆలోచనలు ఉన్నవారిని గుర్తించి అందులో నుంచి బయటపడేలా చేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఛేంజింగ్ ది నారేటివ్ ఆన్ సూసైడ్ (ఆత్మహత్యపై దృక్కోణం మార్చడం) నినాదంతో ముందుకెళుతున్నట్లు చెప్పారు. ఒకింత సంయమనంతో వ్యవహరిస్తూ, సానుకూల దృక్పథంతో ఆలోచిస్తే, ఆత్మహత్యలను చాలావరకు ఆపేయవచ్చన్నారు. ఆత్మహత్య ఆలోచన కలిగిన వ్యక్తులు అత్యవసర పరిస్థితుల్లో టెలీమానస్ హెల్ప్‌లైన్ 14416 ద్వారా తక్షణ సైక్రియాటిక్ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, టూటౌన్ సీఐ రాజారెడ్డి, మోటివేషనల్ స్పీకర్ డీజీ. రామమూర్తి, సైకాలజిస్ట్ డాక్టర్.రాధిక, సోషల్ వర్కర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

• చిత్రం.. భళారే విచిత్రం

ఆర్టీసీ ఆటో స్టాండు.. ఇదేంటి ఆర్టీసీ బస్టాండు కదా.. ఇలా అంటున్నారేంటి అనుకుంటున్నారా .. నిజమే.. ఈ చిత్రంలో కనిపిస్తోంది పీలేరు బస్టాండే. బస్టాండులో బస్సులు కరువై ఆటోలు నిండుకున్నాయి. ఈ చిత్రానికి.. విచిత్రానికి చంద్రబాబునే కారకులు. అనంతపురంలో సూపర్‌సిక్స్ ప్రచార సభ కోసం ఆర్టీసీ బస్సులను తరలించడంతో బుధవారం పీలేరు బస్టాండు కాస్త..ఆటో స్టాండు అయింది. దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు, ఉద్యోగులు, విద్యార్థులు బస్సులు లేక అవస్థలు పడ్డారు. ఇదే అదునుగా ప్రైవేట్ వాహనలు, ఆటో వాళ్లు అడిగినంత ఇచ్చి ప్రయాణికులు వెళ్లాల్సి వచ్చింది. – పీలేరు



వాణిజ్య గదుల వేలానికి స్పందన కరువు

- 61 గదులకు పాడింది ఆరింటికే
- వారం తర్వాత మళ్లీ వేలం పాట



వేలం నిర్వహిస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె : మదనపల్లె మున్సిపాలిటీకి చెందిన వాణిజ్య సముదాయాల్లోని గదులకు బుధవారం నిర్వహించిన లీజు వేలం పాటలకు స్పందన కరువైంది. కమిషనర్ కే.ప్రమీల పట్టణంలోని ముగ్గురాళ్ల వంక, బెంగళూరు బస్టాండ్, చిత్తూరు బస్టాండ్, జీకేవీధి, కోఆపరేటివ్ కాలనీ, సుభాష్‌రోడ్డు, చిత్తూరుబస్టాండ్ కొత్త గదులు, ఆంధ్రకేసరి విపణి కల్పలోని 61 గదులు, టౌన్‌హాలును కలుపుకుని లీజుదారులకు అద్దె ప్రాతిపదికన లీజుకు అప్పగించేందుకు వేలంపాటలను నిర్వహించారు. ఇందులో ముగ్గురాళ్ల వంకకు చెందిన మూడు గదులు, బెంగళూరు బస్టాండ్‌కు చెందిన మూడు గదులకు మాత్రమే పాటదారులు హాజరవగా వేలంలో హెచ్చుపాటదారులకు దక్కించుకున్నారు. మిగిలిన 56 గదులకు సంబంధించి లీజుకోసం ఒక్క పాటదారుడు హాజరుకాకపోవడంతో వాటి వేలం నిర్వహణ ఆగిపోయింది. మున్సిపాలిటీకి మంచి ఆదాయం వచ్చే వాణిజ్య గదుల వేలంపాటలకు స్పందన లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దీనితో పాటు మల్లికార్జున సర్కిల్‌లో ప్రధాన కూడలిలోని ఆంధ్రకేసరి విపణి కల్పకు చెందిన హోటల్, దానిపై పంక్షన్ హాలు, గదులకు వేలం నిర్వహించినా ఒక్కరూ హాజరుకాకపోవడంతో మరింత ఆశ్చర్యం వ్యక్తమైంది. ముఖ్యమైన ఈ వాణిజ్య సముదాయానికి గతంలో తీవ్రమైన పోటీ ఉండేది. పోటీపడి వేలం పాటలు పాడి దక్కించుకునే వారు. ప్రస్తుతం ఈ పరిస్థితికి పూర్తి భిన్నంగా ఒక్కరు పాటలో పాల్గొనలేదు. ఈ వాణిజ్య సముదాయాన్ని గత వేలంపాటలో ఓ వ్యక్తి నెలకు రూ.1,59,500 అద్దెతో దక్కించుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిర్వహణ చేసుకున్నారు. అయితే లీజుపొందిన వ్యక్తి నిర్వహణకు ఆసక్తి చూపకపోవడంతో లీజునుంచి తప్పుకున్నారు. దీనితో ఈఏడాది ఫిబ్రవరి నుంచి ఈ సముదాయం ఖాళీగా ఉంది. దీని కోసం పాటదారులు రాకపోవడంతో అధిక ఆదాయం వచ్చే ఈ వాణిజ్య సముదాయం వృథాగా ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. వేలంపాటల్లో ఆరు గదులకే పాటదారులు రావడంతో మళ్లీ వేలం నిర్వహించేందుకు నిర్ణయించామని, ఈ మేరకు త్వరలోనే ప్రకటన జారీ చేస్తామని కమిషనర్ ప్రమీల ప్రకటించారు.

యూరియా అడిగితే కేసులా..?

ఉద్యమకారులపై అక్రమ కేసులు అప్రజాస్వామ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె రూరల్ : రైతుల పంటలకు అవసరమైన ఎరువులు అందించడంలో కూటమిప్రభుత్వం విఫలమైందని, వెంటనే యూరియా అందుబాటులోకి తేవాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీగా నిరసన తెలిపితే కేసు నమోదు చేసి నోటీసులు అందజేయడం శోచనీయమని సీపీఐ నాయకులు అన్నారు. బుధవారం సీపీఐ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా సహాయకార్యదర్శి కృష్ణప్ప, కార్యవర్గ సభ్యులు సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి కే.మురళీ మాట్లాడుతూ...పోలీసుల సమక్షంలో సబ్ కలెక్టరేట్ ఎదుట శాంతియుతంగా రైతు సమస్యలపై నిరసన తెలిపితే, వన్‌టౌన్ పోలీసులు ఆరుగురు ఉద్యమకారులపై కేసులు నమోదుచేయడం రాజ్యాంగానికి పూర్తి విరుద్ధమన్నారు. రైతులకు యూరియా అందుబాటులో లేదని రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరిగాయని, అయితే అన్నమయ్యజిల్లాలో మాత్రమే కేసులు నమోదుచేశారన్నారు. కమ్యూనిస్టులపై కేసులు పెట్టినంత మాత్రాన రైతులకు యూరియా సమస్య పరిష్కారం అవుతుందనుకుంటే ఎన్ని కేసులు పెట్టినా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లాలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను, వ్యక్తి స్వేచ్ఛను కాపాడాల్సిన ఎస్పీ...ప్రజాసమస్యలపై పోరాటం చేసే కమ్యూనిస్టు నాయకులపై కేసులు నమోదుచేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందన్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ మీడియా సమావేశంలో చెపుతున్నారని, మదనపల్లె వ్యవసాయశాఖ కార్యాలయం, సచివాలయాలు, ఆర్‌ఎస్‌కేలు, ఎరువుల దుకాణాల వద్ద రైతులు యూరియా కోసం పడుతున్న అగచాట్లు తెలుస్తాయన్నారు. అప్రజాస్వామిక విధానాలు, అక్రమకేసులపై సీపీఐ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తిరుమల, దేవా, రెడ్డి, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే కేసులు

కలకడ : యూరియా అధిక ధరకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని మండలంలోని అన్ని ఎరువుల దుకాణాలకు అధికారులు హెచ్చరించారు. కలకడ, దేవులపల్లె సచివాలయంలో యూరియా నిల్వ చేసినట్లు తహసీల్దార్ మహేశ్వరిభాయ్ తెలిపారు. బుధవారం మండలంలోని కదిరాయచెర్వులో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. రైతులు బ్లాక్‌మార్కెట్‌లో ఎరువులు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో రైతులు కూడా బిల్లు విధిగా అడిగితీసుకోవాలని కోరారు. ఎక్కడైనా ఎరువులను బిల్లులు లేకుండా కొనుగోలు చేసినా, అధిక ధరలకు విక్రయించినట్లు తెలిస్తే సమాచారం అందించాలని తెలిపారు. ఫిర్యాదులను టోల్ ఫ్రీనెంబర్ 08561293006కు తెలియజేవచ్చన్నారు.

నానో యూరియా వాడకంపై అవగాహన



నానో యూరియా వాడకంపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

నిమ్మనపల్లె : నానో యూరియా వాడకంతో భూమి సారాన్ని కాపాడుకోవచ్చని వ్యవసాయ అధికారి మంజుల అన్నారు. బుధవారం మండలంలోని ముస్తూరు కొండయ్య గారి పల్లె గ్రామాలలో రైతులకు నానో యూరియా వాడకంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. నానో యూరియాతో రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. కాలానుగుణంగా రైతులు సహజ ఎరువులను ఉపయోగించి దిగుబడులు పెంచుకోవాలని సూచించారు. పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె వైద్యురాలికి గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న కంటి వైద్యులు కే.శాశ్వతి

మదనపల్లె రూరల్ : పట్టణంలోని గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కంటి వైద్యనిపుణురాలు కే.శాశ్వతి, వైజాగ్ ఆంధ్రమెడికల్ కాలేజీలో 2018 విద్యాసంవత్సరం బ్యాచ్‌లో మాస్టర్స్ డిగ్రీలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. విజయవాడలో బుధవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శాశ్వతి, ఎం.ఎస్.ఆప్తాల్మాలజీలో రాష్ట్రవ్యాప్తంగా అధిక మార్కులు సాధించినందుకు, బెస్ట్ అవుట్‌గోయింగ్ క్యాండిడేట్‌గా నిలిచినందుకు డాక్టర్.రత్నాకరం శ్రీనివాసాచార్య, డాక్టర్.స్వామి శరణ్ బొమ్మకంటి మెమోరియల్ గోల్డ్‌మెడల్స్ అందుకున్నట్లు తెలిపారు. తమ ఆస్పత్రికి చెందిన కంటి వైద్యురాలు మాస్టర్స్ డిగ్రీ వైద్యవిద్యలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి గోల్డ్‌మెడల్స్ అందుకున్న సందర్భంగా గ్లోబల్ హాస్పిటల్స్ మల్టీ స్పెషాలిటీ డాక్టర్.కే.అవినాష్, ఎంఎస్.(ఆర్థోపెడిక్స్), మేనేజింగ్ డైరెక్టర్ కే.సరళ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

టీబీ వ్యాధిని నిర్మూలిద్దాం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మహ్మద్ రఫీ

మదనపల్లె : టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని జిల్లా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ అన్నారు. బుధవారం మదనపల్లె పట్టణంలోని పాఠశాలల్లో టీబీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల టీబీ ముక్త్ అభియాన్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి మద్యం, పొగ, మత్తు పదార్థాలను సేవించే వారి వివరాలను సేకరించి టీబీ లక్షణాలపై గుర్తించే ప్రక్రియ నిర్వహిస్తారని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులన్న వారిని గుర్తించి పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రోగులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సూపర్‌వైజర్ ప్రభాకర్, టీబీ యూనిట్ సిబ్బంది సుశీల, వనజ,సరిత, తరుణ్, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా పంపిణీ కేంద్రం తనిఖీ



యూరియా పంపిణీపై ఆరా తీస్తున్న సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

రామసముద్రం : మండలంలోని మినికి గ్రామంలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు.అలాగే యూరియా నిల్వలపై వ్యవసాయాధికారి జాఫర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండించే ప్రతి ఎకరాకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. సాగు చేస్తున్న ప్రతి రైతుకు యూరియా అందేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. రైతులకు ఇబ్బందిలేకుండా నిబంధనల మేరకు యూరియా పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారికి ఇతర సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహహల్దార్ అజారుద్దీన్, ఆర్‌ఐ వసీం, వీఆర్వో, రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సరైన ప్రణాళికతో విదేశాల్లో ఉన్నత విద్య



మాట్లాడుతున్న విసాస్ డైరెక్టర్ విశ్వా కె.రెడ్డి

మదనపల్లె సిటీ : సరైన ప్రణాళిక ఉంటే విదేశాల్లో ఉన్నత స్థాయి విద్యను సులభంగా అభ్యసించవచ్చునని యోస్ విసాస్ డైరెక్టర్ విశ్వా కె.రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో విదేశీ విద్యావకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు విదేశీ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశ విధానం, స్కాలర్‌షిప్‌లు, వీసా ప్రక్రియలు, ఖర్చుల వివరాలు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యా అవకాశాలు గురించి వివరించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి విద్యార్థులు ప్రతిభ, కృషిని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాయుడు, డీన్ భాస్కరన్, కెరీర్ గైడెన్స సెల్ కోఆర్డినేటర్ ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ధర్నా విజయవంతం చేయండి



ఆటో కార్మికులతో ఏఐటీయూసీ నాయకులు

పీలేరు రూరల్ : ఆటో కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి నరసింహులు అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ వద్ద ఆటో కార్మికులతో మాట్లాడుతూ స్త్రీశక్తిపథకంతో ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయినట్లు తెలిపారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరేట్ చేపట్టనున్న ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ వసీమ్, ముబారక్, రమణ, శ్రీనాథ్‌రెడ్డి, రాయుడు, బాలాజి, సయ్యద్‌బాషా, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల ఫారంపై చర్యలు తీసుకోండి

తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

నిమ్మనపల్లె : కోళ్ల ఫారాల నిర్వహణలో నిర్లక్ష్యం చూపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పిట్టావాండ్లపల్లి గ్రామస్తులు తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కోళ్ల ఫారం వ్యర్థాల వల్ల గ్రామంలోని ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులపై బుధవారం గ్రామస్తులు స్థానిక రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని, తహసీల్దార్ తపస్వినికి వినతి పత్రం అందించారు. మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ పిట్టవాండ్లపల్లె వడ్డిపల్లెకు సుమారు 50 మీటర్ల దూరంలో మదనపల్లెకు చెందిన వ్యక్తి కోళ్ల ఫారం నిర్వహిస్తున్నారన్నారు. కోడి గుడ్లను ఉత్పత్తి చేస్తూ పారిశుధ్యంపై నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. దీంతో తాము అనేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కోళ్ల వ్యర్థాలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో, దుర్వాసన భరించలేకున్నామని, దోమలు, ఈగలు విపరీతంగా వచ్చి చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయాలన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంచాయతీ అధికారులు, రెవెన్యూ అధికారులు కోళ్ల ఫారాల యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



చెస్ పోటీల్లో విద్యార్థులు

ములకలచెరువు : మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం స్థానిక ఆదర్శ విద్యాలయంలో ప్రారంభమయ్యాయి. మండలానికి చెందిన 75 మంది విద్యార్థులకు చెస్, యోగా పోటీలను నిర్వహించగా గెలుపొందిన వారిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తున్నట్టు ఎంఈవో శంకరప్ప తెలిపారు. దేవలచెరువు, సొంపల్లె, ములకలచెరువు హైస్కూళ్లలో మిగిలిన క్రీడలకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

ఆస్పత్రుల్లో పరిశుభ్రత పాటించాలి

తంబళ్లపల్లె : స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిశుభ్రత పాటించాలని పీలేరు సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తంబళ్లపల్లె సీహెచ్‌సీని సందర్శించారు. స్వచ్ఛ ఆంధ్రలో నిర్దేశించిన పారామీటర్ అంశాలను పరిశీలించారు. మెటర్నటీ వార్డు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఎక్స్‌రే, ఓపీ విభాగాలు,ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ఆస్పత్రిలో పని తీరుపై డాక్టర్ విశ్రాంత్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఈఏపీసెట్ ప్రతిభావంతులకు నగదు ప్రోత్సాహం



నగదు బహుతిని అందజేస్తున్న యువరాజ్, మిట్స్ ఏఓలు

కురబలకోట : అంగళ్లు డీమ్డ్ యూనివర్సిటీ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈఏపీసెట్ ప్రాక్టీస్ పరీక్షలో ప్రతిభ కనపరచిన పది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున నగదు బహుమతి అందజేసినట్లు వీసీ యువరాజ్ బుధవారం తెలిపారు. షేక్ షాబీర్, సి.రాంచరణ్, డి. సయ్యద్ సాహిల్, టి. హరీష్, వి.మధుచరణ్, షేక్ యాదుల్లా, బి. వెంకటేశ్వర్లు, వి.టాగోర్, సయ్యద్ మహమ్మద్, ఎం. శ్రీలిఖిత ఈ బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ డి. ప్రదీప్‌కుమార్, సీనియర్ మేనేజర్, క్రియాశీలక పీఆర్వో మారుతీ ప్రసాద్, రియాజ్ అలీ, జి. శ్రీనివాసులు, ముస్తఫా పాల్గొన్నారు.